సాక్షి విశాఖపట్నం

శనివారం । 16 । నవంబర్ । 2024



వరాహ పుష్కరిణికి నక్షత్ర హారతి ఇస్తున్న సింహాచలం దేవస్థానం అర్చకుడు

దీప కాంతుల్లో.. కార్తీక వెన్నెల



కొత్త వెంకోజీపాలెం గౌరి జ్ఞానలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి దీపారాధన

సృష్టికి తొలిదీపం భగవంతుడే.. ఆయనే జ్యోతి స్వరూపుడు. అందుకే ఏ దేవుని, దేవత నామావళిని మనం గమనించినా పరంజ్యోతి, జ్యోతిసే నమఃఅని.. పరంజ్యోతియే నమః, జ్యోతిస్వరూపాయై నమః అని ఉంటుంది. తాను ప్రకాశిస్తూ అన్నింటినీ ప్రకాశింప జేసే రూపం ఏదో అదే జ్యోతి. అదే భగవంతుడు. వెలుగులకు వెలుగు, సమస్త లోకాలను కాంతిమయం చేయగలిగిన వాడు పరమాత్ముడే. ఆ జ్యోతి మన హృదయాలలో కూడా ఆత్మజ్యోతిగా ప్రకాశించాలనే ప్రార్థనతో చేసేదే దీపారాధన. పవిత్రమైన కార్తీకమాసంలో అన్ని రోజులు ప్రత్యేకమే అయినా.. కార్తిక పౌర్ణమి మరింత విశిష్టం. అందుకే ఆ పర్వదినాన గృహాలు, ఆలయాలు దీపకాంతుల శోభతో కళకళలాడాయి. దేవాలయాలు జ్వాలాతోరణాలతో దేదీప్యమానంగా ప్రకాశించాయి.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



నాగేంద్ర హారాయ..త్రిలోచనాయ : వన్‌టౌన్ శివాలయంలో శివలింగానికి క్షీరాభిషేకం



ఇసుకకొండ సత్యనారాయణస్వామి దేవాలయానికి పోటెత్తిన భక్తులు



గోకుల్ పార్కు వద్ద భక్తుల సందడి



సబ్బవరం మండలం పెదయాతపాలెంలోని ద్వాదశ జ్యోతిర్లింగ సహిత గౌరీపరమేశ్వరుల ఆలయంలో..

న్యూస్‌రీల్

నావిక్ సెల్ 21పై వీపీఏ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ అంగముత్తు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ నావిక్ సెల్ 21పై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ సమావేశానికి పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అధ్యక్షత వహించారు. పలు మంత్రిత్వ శాఖలు, సంబంధిత సంస్థల నుంచి సీనియర్ అధికారులు దీనికి హాజరయ్యారు. నావిక్ సెల్‌కు సంబంధించి గత సమీక్షా సమావేశాల్లో కేంద్ర నౌక, జల రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శి అందించిన మార్గదర్శకాల అమలు, మంత్రిత్వ శాఖల సహకారం, సముద్ర రంగానికి సంబంధించి భవిష్యత్ కార్యాచరణపై ఇందులో చర్చించారు. నౌకాయాన రంగంలో ముఖ్యమైన అంశాలపైన సమగ్రమైన విధానాలను రూపొందించే దిశగా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ఈ సమీక్షలో రైల్వే, హోం, పర్యావరణ, అటవీ, రోడ్డు రవాణా, హైవేస్, పునరుత్పాదక శక్తి వంటి వివిధ మంత్రిత్వ శాఖల నుంచి సంబంధిత విధానాలు, చట్టాలు, మార్గదర్శకాలను కూడా పరిశీలించారు.

వెనక్కి వెళ్లిన సముద్రం



జోడుగుళ్లపాలెం వద్ద వెనక్కి వెళ్లిన సముద్రం

ఏయూక్యాంపస్: విశాఖలో సముద్రం వెనక్కి వెళ్లింది. ప్రతీ పౌర్ణమి, అమావాస్య రోజుల్లో సముద్రం ఆటుపోట్లకు గురవుతుంది. ఈ సమయంలో సముద్రం కొంత వెనక్కి వెళ్లడం, ముందుకు రావడం జరుగుతుంటుంది. శుక్రవారం పౌర్ణమి కావడంతో జోడుగుళ్లపాలెం, పాండురంగాపురం, ఆర్.కె బీచ్ తదితర ప్రాంతాలలో సముద్రం వెనక్కి వెళ్లి రాళ్లు బయటకు కనిపించాయి. దీంతో పర్యాటకులు, నగరవాసులు రాళ్లపైకి వెళ్లి ఫొటోలు తీసుకోవడానికి ఆసక్తి చూపారు.

డ్రోన్ టెక్నాలజీపై ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలోని స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతీ యువకులకు డ్రోన్ టెక్నాలజీ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. పదో తరగతి ఆపై అర్హత కలిగిన 18–45 వయస్సు కలిగినవారు ఈ కోర్సులో చేరవచ్చని చెప్పారు. మూడు నెలల పాటు డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్, అసెంబ్లింగ్ టెక్నీషియన్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. 30 సీట్లు మాత్రమే ఉన్నాయని అర్హులైన వారు నేరుగా కాలేజీలోని కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. వివరాలకు 728706 9457 నంబరులో సంప్రదించవచ్చని సూచించారు. కోర్సు పూర్తి చేసుకున్నవారికి టెక్నికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. వీరి ఉపాధి అవకాశాలకు సహకారం అందిస్తామని ఆయన చెప్పారు.

సిటీలు సింగపూర్‌లు కావాలంటే

ఆర్కిటెక్ట్స్‌కు అవకాశమివ్వాలి

సాక్షి ఇంటర్వ్యూ



రాజేష్ నాగుల

- దేశంలో నిపుణుల కొరత లేకపోయినా అవకాశాలు సన్నగిల్లుతున్నాయి
- ప్లానింగ్ చట్టంలో మార్పులు చేస్తేనే అద్భుతాలు
- ప్రభుత్వ ప్రాజెక్టులకీ ఆర్కిటెక్ట్స్‌ని వినియోగించడం లేదు
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ విశాఖ చైర్మన్ రాజేష్

సాక్షి, విశాఖపట్నం : దేశ వ్యాప్తంగా చేపట్టే ప్రభుత్వ ప్రాజెక్టులకు నిపుణులైన ఆర్కిటెక్ట్స్‌కు అవకాశాలు కల్పిస్తే.. సిటీలన్నీ సింగపూర్‌లుగా మారతాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ విశాఖ సెంటర్ చైర్మన్ రాజేష్ నాగుల స్పష్టం చేశారు. దేశంలో ఆర్కిటెక్చర్ నిపుణుల కొరత లేకపోయినప్పటికీ అవకాశాలు మాత్రం సన్నగిల్లుతుండటంతో.. కోర్సులపై విద్యార్థుల్లో ఆసక్తి సన్నగిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న పట్టణీకరణ, జనాభాను అంచనావేస్తే భవిష్యత్తులో ప్రపంచ వ్యాప్తంగా ఆర్కిటెక్ట్‌లకు అనూహ్య డిమాండ్ ఉంటుందన్నారు. నగరంలో జరిగిన ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్ ఎక్స్‌పో (ఏఐ ఎక్స్‌పో)–2024ను రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్కిటెక్చర్ కోర్సులకు సంబంధించిన అవకాశాలు, ప్రస్తుత పరిణామాల్ని 'సాక్షి'కి వెల్లడించారు.

కెరీర్ అద్భుతంగా ఉంటుంది

బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ ప్రచురించిన తాజా నివేదిక ప్రకారం, భారతదేశంలో ఆర్కిటెక్ట్స్‌కు ఉపాధి రేటు 2020–30 మధ్య అంటే ఈ దశాబ్ద కాలంలో 1% పెరుగుతుందని అంచనా వేశారు. 2030 నాటికి దేశ జనాభా 1.5 బిలియన్లకు చేరుబోతున్న తరుణంలో.. ఇళ్ల నిర్మాణాలు, కార్యాలయ స్థలం, ఇతర మౌలిక సదుపాయాల అవసరం పెరుగుతూనే ఉంటుంది. దేశంలోని విశ్వవిద్యాలయాలు, ఇన్‌స్టిట్యూట్స్ నుంచి ఆర్కిటెక్చర్‌ను అభ్యసించాలనుకుంటే ఏ విద్యార్థికైనా ఈ రంగంలో కెరీర్ వృద్ధి చాలా ఆశాజనకంగా కనిపిస్తుంది. ముఖ్యంగా.. దేశంలో పెరుగుతున్న నిర్మాణ పరిశ్రమ, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వ కార్యక్రమాల కారణంగా ఆర్కిటెక్ట్స్‌కు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. పట్టణీకరణ, స్థిరమైన , ఇంధన–సమర్థవంతమైన భవనాలపై పెరుగుతున్న ఆసక్తి.. ఆర్కిటెక్చర్‌లో అవకాశాల్ని పెంపొందిస్తున్నాయి. ముఖ్యంగా పర్యావరణ సమస్యలపై పెరుగుతున్న అవగాహనతో, భారతదేశంలో స్థిరమైన ఆర్కిటెక్చర్‌కు గణనీయమైన డిమాండ్ ఉంది.

అప్పుడే సిటీలు సింగపూర్‌లుగా మారతాయి

ఆర్కిటెక్ట్స్‌లను వినియోగించుకోకపోవడంతో ఈ కోర్సుల్లో చేరే వారి సంఖ్య తగ్గిపోతోంది. అందుకే దేశ వ్యాప్తంగా ఆర్కిటెక్ట్స్ కాలేజీలు మూతపడుతున్నాయి. ఏపీలో రెండు కాలేజీల్ని మూసేసుకున్నారు. అవకాశాలున్నా వాటిని కల్పించడంలో విఫలమవుతున్నాం. ఉదాహరణకు ప్రభుత్వాలు కూడా ఆర్కిటెక్ట్స్‌ని సరిగా వినియోగించుకోవడం లేదు. కొన్ని ప్రభుత్వ ప్రాజెక్టులకు కూడా ఆర్కిటెక్ట్స్‌ల స్థానంలో సివిల్ ఇంజినీర్లపైనే ఆధారపడుతున్నారు. ఇందులో మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం ఇంకా వెనకబడి ఉంది. 2002లో ఇచ్చిన ప్రభుత్వ జీవో ప్రకారం 300 చ.మీ.కంటే ఎక్కువ విస్తీర్ణం ఉంటే ఆ డిజైన్‌పై ఆర్కిటెక్ట్స్ సంతకం ఉండాలనే రూల్ పెట్టారు. 2012 తర్వాత ఆ క్లాజ్‌ని తీసేశారు. అప్పటి నుంచి వీరికి ప్రాధాన్యత రాష్ట్రంలో తగ్గిపోయింది. ఇప్పుడు రెరా చట్టం ప్రకారం 500 చ. గజాల పైన ఉండే ప్రతి ప్లాన్‌పైనా వీరి సంతకం ఉండాలి. దానికి ఆర్కిటెక్ట్స్ అవసరమైనప్పుడు మిగిలిన వాటికి ఎందుకు ఉండకూడదు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందించనున్నాం. ప్రభుత్వ ప్రాజెక్టులకు, 500 చ.గజాలపైన ఉండే ప్రతి భవనానికి ఆర్కిటెక్ట్స్‌ని వినియోగించాలని వినతి పత్రం అందించనున్నాం. సింగపూర్, హాంకాంగ్ దేశాల్లో ఆర్కిటెక్ట్స్‌పైనే ప్రతి ప్రాజెక్టు ఆధారపడి ఉంటుంది. సింగపూర్ లో చిన్న భవనానికైనా ఆర్కిటెక్ట్స్ అవసరం. అలాంటి చట్టాలు తీసుకొస్తేనే మన సిటీలు కూడా సింగపూర్‌లు అవుతాయి.

నైపుణ్యం ఉంది.. అవకాశాలు కల్పించాలి

దేశంలో నిపుణులైన ఆర్కిటెక్ట్స్‌లున్నారు. విశాఖలో 200కిపైగా ఆర్కిటెక్ట్స్‌లున్నారు. శ్రీకాకుళంలో 50 మంది నర్సీపట్నంలో 10 మంది వరకూ ఉన్నారు. ఏపీలో మొత్తంగా 800కిపైగా నిపుణులైన ఆర్కిటెక్ట్స్‌లున్నారు. కానీ అవకాశాలు ఆశించిన మేర రావడం లేదు. 1990ల మధ్యకాలం నుంచి దేశంలో పట్టభద్రులవుతున్న ఆర్కిటెక్ట్స్‌ల సంఖ్య రెట్టింపు అయింది. 1972లో కేవలం 12 ఆర్కిటెక్చర్ ఇన్‌స్టిట్యూట్స్ ఉండగా.. భారతదేశం ఇప్పుడు సుమారు 500 వరకూ ఉన్నాయి. ప్రతి సంవత్సరం 20,000 మంది గ్రాడ్యుయేట్స్ వస్తున్నారు. అందుకే అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించే సత్తా ఏపీ ఆర్కిటెక్ట్‌లకు ఉంది.

ఇంజినీర్లు వేరు.. ఆర్కిటెక్ట్స్ వేరు..

1998 తర్వాత నుంచి ఏఐ ఎక్స్‌పో **ప్రారంభించి అవగాహన** కల్పించేందుకు కృషి **చేస్తున్నాం. 2005 నాటికి** ఆర్కిటెక్ట్స్‌లకు గుర్తింపు **వచ్చింది. అయితే** ఇప్పుడు సివిల్ ఇంజి**నీర్లు కూడా** ఆర్కిటెక్ట్స్‌లుగా చలామణి అయిపోతున్నారు. ఇది ఆర్కిటెక్ట్ చట్టం ప్రకారం తప్పు. ఇంజినీర్లు బిల్డింగ్ ప్లాన్ ఇవ్వొచ్చు. కానీ..ఆర్కిటెక్ట్స్‌గా చెప్పుకోవడం సరికాదు. సివిల్ ఇంజినీర్లతో కలిసి ఆర్కిటెక్ట్స్‌లు పనిచేస్తేనే మంచి అవుట్‌పుట్ వస్తుంది. ఆర్కిటెక్ట్స్ అంటే ఎవరు, ఇంజినీర్ ఎవరనే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని కౌన్సిల్ తరఫున నిర్వహించనున్నాం.

ఆర్కిటెక్చర్.. అదిరింది



ఏయూ ఆర్కిటెక్చర్ విద్యార్థులు రూపొందించిన నమూనాలు



ఇంటీరియర్ డిజైన్

ఆర్కిటెక్చర్ ఇంటీరియర్ డిజైన్లను ప్రదర్శిస్తూ.. భవిష్యత్తులో ఆర్కిటెక్ట్స్ పాత్ర ఎంత ముఖ్యమో తెలియజెప్పేందుకు నగరంలో ఏఐఎక్స్‌పో–2024 శుక్రవారం ప్రారంభమైంది. ది ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్ ఎక్స్‌పోలో దేశంలోని ప్రసిద్ధి చెందిన ఇంటీరియర్ డిజైన్ సంస్థలు తమ ఉత్పత్తుల్ని ప్రదర్శనకు ఉంచాయి. సెన్సార్‌తో పనిచేసే కమోడ్స్, అద్భుతమైన గ్లాస్ డిజైన్‌లు, టైల్స్, తేలియాడే ఇటుకలు, బాత్ టబ్స్, షవర్ టవర్స్... ఇలా భిన్నమైన మోడల్స్ అందర్నీ ఆకట్టుకున్నాయి.



ప్రదర్శనలో వివిధ నమూనాలు



భిన్నమైన ఇంటీరియర్ డిజైన్లు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా బొడ్డేడ ప్రసాద్



సాక్షి, అనకాపల్లి : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా బొడ్డేడ ప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

పర్యాటకుల భద్రతే ముఖ్యం



బోటులో ప్రయాణించి తీరానికి చేరుకున్న డీఐజీ గోపీనాథ్ జెట్టీ

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌కు వచ్చిన పర్యాటకుల భద్రతే ప్రధానంగా మెరైన్ పోలీసులు విధులు నిర్వహించాలని మెరైన్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ అన్నారు. శుక్రవారం సాయంత్రం రుషికొండ బీచ్, మెరైన్ ఎస్పీ రవివర్మ, డీఎస్పీ బాలరాజుతో కలిసి సందర్శించారు. కార్తీక మాసం కావడంతో రుషికొండ బీచ్‌కు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారని ఈ క్రమంలో మెరైన్ పోలీసులు, లైఫ్‌గార్డ్స్ అప్రమత్తంగా ఉండి వారి భద్రత ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. అదే విధంగా సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. సముద్రంలో ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. బీచ్ కమ్యూనిటీ గార్డ్స్‌తో మాట్లాడుతూ ప్రమాదాలు, రక్షణ తదితర అంశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇక్కడ ఉన్న బోటు షికారులో కొంత మేర పర్యటించి వెనుతిరిగారు. అక్కడ నుంచి రుషికొండలోని మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈయన వెంట మెరైన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

29న ప్రధాని రాక

మహారాణిపేట: ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 29న విశాఖ వస్తున్నారు. ఆ రోజు ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటారని అధికారులు తెలిపారు.

అభివృద్ధి ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో చేపట్టనున్న అభివద్ధి ప్రాజెక్టులపై, భవిష్యత్తు కార్యాచరణపై కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సమీక్షించారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవానీ శంకర్, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులతో కలిసి వివిధ అంశాలపై కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా పర్యాటకానికి, పచ్చదనానికి పెద్దపీట వేస్తూ జిల్లాలో కార్యాచరణ రూపొందించాలని, ఇక్కడి వాతావరణ పరిస్థితులకు సరిపడే మొక్కలను పెంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వీఎంఆర్డీఏ, జీవీఎంసీ పరిధిలో చేపట్టాల్సిన ప్రాజెక్టులపై సమీక్షించిన ఆయన నగరాన్ని అనుసంధానం చేసే ప్రధాన రోడ్లపై దృష్టి సారించాలని, వాటి అభివృద్ధికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విశాఖ – రాయపూర్ హైవే, ఆనందపురం వద్ద గల హైవే రోడ్డులో పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. నగర ప్రజలకు నిత్యం తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు, యూజీడీ నిర్వహణకు సంబంధించి మెరుగైన చర్యలు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ, పీపీపీ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వ ఆదేశాలకు మేరకు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు.

ప్రశాంతంగా బీఎడ్ పరీక్షలు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఎడ్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. వర్సిటీ ఐఏఎస్ఈ విభాగంలోని పరీక్ష కేంద్రాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగరాజకుమారి శుక్రవారం పర్యవేక్షించారు. బీఎడ్ సెకెండ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించామన్నారు.

జనవరి నాటికి స్వర్ణభారతి స్టేడియం పనులు పూర్తి



బాక్సింగ్ క్రీడాకారులతో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

సీతంపేట: స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులు 2025 జనవరి నాటికి పూర్తిచేయాలని జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ అధికారులు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, సాడి పద్మావతిలతో కలిసి స్టేడియం అభివృద్ధి పనులను పరిశీలించారు.స్టేడియంలో ఎక్కువ మంది వీక్షకులు, క్రీడాకారులు కూర్చునేందుకు వీలుగా ఆధునిక కుర్చీలను ఏర్పాటు చేయాలని ప్రధాన ఇంజినీర్ పి.శివప్రసాద్‌రాజు, అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తిని కమిషనర్ ఆదేశించారు. టెన్నిస్ కోర్టు నిర్వహణను నిత్యం పర్యవేక్షించాలని స్పోర్ట్స్ డైరెక్టర్ రాజును ఆదేశించారు. అనంతరం ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఉమెన్ బాక్సింగ్ చీఫ్ కోచ్ ఐ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ తరఫున మహారాష్ట్ర భూశ్వాల్‌లో నవంబరు 6 నుంచి 9 వరకు జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ ఉమెన్ నేషనల్ బాక్సింగ్ పోటీల్లో సాధించిన ట్రోఫీని కమిషనర్‌కు చూపించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్ పి.వి.వి.సత్యనారాయణ, ఏసీపీ సి.హెచ్.మధుసూదనరావు, సహాయ వైద్యాధికారి బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

శివోహం.. భజేహం


కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో భక్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు

- కనులపండువగా జ్వాలాతోరణం

మద్దిలపాలెం: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో నిర్వహించిన జ్వాలాతోరణ మహోత్సవం కనుల పండువగా సాగింది. తెల్లవారుజాము నుంచి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు, బిల్వార్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మహిళలతో సామూహిక కుంకుమార్చన చేపట్టారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఉపవాసాలు చేసి, సాయంత్రం కేదారేశ్వరుని వ్రతం ఆచరించారు. అనంతరం ఆలయంలో జరిగిన జ్వాలాతోరణ మహోత్సవంలో పాల్గొన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ కులపతి జి.ఎస్.ఎన్.రాజు, పలువురు ప్రముఖులు జ్వాలా తోరణాన్ని వెలిగించారు. ఆలయ ప్రాంగణంలో రెండు కర్రలను స్తంభాలుగా ఏర్పాటు చేసి.. వాటికి గడ్డితో తయారు చేసిన తాడును కట్టడమే జ్వాలాతోరణం. శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి, భక్తులు మూడుసార్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం వెలుగుతున్న జ్వాలాతోరణం కింద మూడుసార్లు ప్రదక్షిణ చేసి, కాలిన జ్వాలాతోరణం నుంచి మిగిలిన బూడిదను బొట్టుగా పెట్టుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ఎ.రామకృష్ణ శర్మ, పి.సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి, పి.బాల భాస్కరశర్మ తదితరులు భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. దేవస్థానం ఈవో బండారు ప్రసాద్, రాంబాబు, రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు, స్థానికులు పీలా నాగేశ్వరరావు, మద్దాల వీర వెంకట అప్పారావు కామేశ్వరరావు పాల్గొన్నారు.


సైకత శివ లింగాలకు పూజలు చేస్తున్న మహిళలు


శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

సముద్రస్నానాలు ఆచరించిన ప్రజలు

ఏయూక్యాంపస్: కార్తీక పౌర్ణమి సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు సముద్రస్నానాలు ఆచరించారు. ఉదయం సాగరతీరంలో పవిత్ర స్నానాలు ఆచరించి, అనంతరం తీరంలో సైకత లింగాన్ని తయారు చేసి పూజలు చేశారు. దీపాలు వెలిగించి పూజలు జరిపారు. ఆర్.కె.బీచ్ నుంచి సాగర్‌నగర్ వరకు తీర ప్రాంతంలో సందడి నెలకొంది.

సత్యదేవునికి భక్త నీరాజనం

- పెద్ద ఎత్తున పౌర్ణమి పూజలు, వ్రతాలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయం


సత్యనారాయణ స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు(ఇన్‌సెట్) రమా సత్యనారాయణ స్వామి

డాబాగార్డెన్స్: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇసుక కొండ(బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. గోవింద నామాలు స్మరిస్తూ దేవదేవుడిని దర్శించుకున్నారు. పెద్ద ఎత్తున సామూహిక వ్రతాలు జరిగాయి. అనివెట్టి మండపంలో కూడా పౌర్ణమి పూజ లు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఏర్పాట్లు చేసింది. పూర్ణామార్కెట్ దరి దయారామ్ స్వీట్ షాప్ పక్క నుంచి ఆలయానికి ఏర్పాటు చేసిన ఘాట్ రోడ్డును భక్తులు సద్వినియోగం చేసుకున్నారు.

పూజలు జరిగాయిలా.. : వేకువ జాము రెండు గంటలకు ధ్వజ స్తంభ పూజ, విశేష దర్పణం జరిపారు. 2.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు స్వామి దర్శనం కల్పించారు. మళ్లీ సాయంత్రం 4 గంటలకు ధ్వజస్తంభం పూజలు నిర్వహించారు. రూ.1,116 చెల్లించిన భక్తులతో అనివెట్టి మండపంలో ఉదయం 7, 10.30 గంటలకు ప్రత్యేక వ్రతాలు చేయించారు. ఉదయం 4, 6, 9 గంటలకు సామూహిక వ్రతాలు జరిగాయి. భక్తుల తాకిడి దృష్ట్యా ఆలయ చుట్టూ ప్రదక్షిణలు రద్దు చేశారు. ఈవో రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వరాహ పుష్కరిణికి పుణ్యనదీ హారతి


ఆకట్టుకున్న చిన్నారుల నృత్యప్రదర్శన


వెంకన్న ఉత్సవమూర్తులకు నక్షత్ర హారతి ఇస్తున్న అర్చకుడు

సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం సింహాచలం దేవస్థానంలో పుణ్య నదీ హారతి (గంగా హారతి) కార్యక్రమం వైభవంగా జరిగింది. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు పుష్కరిణి గట్టుపై దీపారాధన చేశారు. కోలాటం, నృత్యాలు, సంకీర్తనలతో స్వామిని కొలిచారు. తొలుత శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆల యం నుంచి వెంకన్న ఉత్సవమూర్తులను సాయంత్రం 4.30 గంటలకు తిరువీధిగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ వేదికపై ఉత్సవమూర్తులను శేషతల్పంపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం ద్వయ హారతులు, నక్షత్ర హారతి, కుంభ హారతి స్వామికి సమర్పించారు. తర్వాత ఎనిమిది మంది అర్చకులు పుష్కరిణికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఎనిమిది వేదికలపై నిలబడి వరాహ పుష్కరిణికి నక్షత్ర హారతులిచ్చారు. విశేషంగా తరలివచ్చిన భక్తులు ఈ కార్యక్రమాలను తిలకించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, చిన్నా ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈవో వి.త్రినాథ రావు ఆధ్వర్యంలో ఈఈ శ్రీనివాసరాజు, ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. సింహాచలంనకు చెందిన కూచిపూడి నాట్యగురువు సౌమ్య ఆధ్వర్యంలో చిన్నారుల ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, మహిషాసురమర్దిని నృత్యరూపకం విశేషంగా అలరించాయి.

ఏరోస్పేస్ శిక్షణకు 50 మంది ఎంపిక


శిక్షణకు ఎంపికైన పెందుర్తి విద్యార్థులు

పెందుర్తి: ఏరోస్పేస్ ఇండస్ట్రియల్ శిక్షణ తరగతులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక కళాశాలలో శుక్రవారం ఏరోస్పేస్ విభాగంలో 6 నెలల శిక్షణ తరగతులకు గానూ రాత పరీక్షలు నిర్వహించారు. విశాఖ, పెందుర్తి, శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 100 విద్యార్థులు పాల్గొనగా వీరిలో విశాఖ కళాశాల నుంచి 30 మంది, పెందుర్తి కళాశాల నుంచి 15 మంది, శ్రీకాకుళం నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. వీరికి అచ్యుతాపురంలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రంలో శిక్షణ ఇస్తారని సాంకేతిక విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.వి రామకృష్ణ తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ చంద్రశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నా భర్త మృతిపై నిగ్గు తేల్చండి

- స్టీల్ ప్లాంట్ అసిస్టెంట్ మేనేజర్ తాతారావు భార్య బంగారమ్మ వేడుకోలు
- పోలీసులు, యాజమాన్య ద్వంద్వ వైఖరితో ఆర్థిక ప్రయోజనాలు కోల్పోయాం


వివరాలు వెల్లడిస్తున్న తాతారావు భార్య బంగారమ్మ

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసిన నాట్రా తాతారావు మృతిపై నిజాలు వెలికితీయాలని అతని భార్య బంగారమ్మ డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 2017 జూలై 11న కొంత మంది తాతారావును హత్య చేయించి, ప్రమాదవశాత్తు చనిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశారని.. కుళ్లిన మృతదేహాన్ని మూటకట్టించి జూలై 15న కేజీహెచ్ మార్చురీ నుంచి తమకు పంపించారని ఆమె ఆరోపించారు. అదే నెల 28న తాతారావు మృతిపై అనుమానాలున్నాయంటూ నగర పోలీసు కమిషనర్, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి లేఖ రాశారన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, పోలీసులు ఎందుకు నాటకాలు ఆడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. చివరకు తాతారావు మృతిలో ఎటువంటి అనుమానాలు లేవని పోలీసు కమిషనర్ ఉక్కు యాజమాన్యానికి స్పష్టం చేశారని, దీని వెనుక పెద్ద కుట్ర జరిగిందన్నారు. తన భర్త మృతికి గల కారణాలు తెలియవని చీఫ్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ చెబుతుండగా.. తాతారావు మృతి ప్రమాదవశాత్తు జరిగింది కాదంటూ ఉక్కు యాజమాన్యం మరోలా చెబుతోందన్నారు. విధులు నిర్వహిస్తుండగా తన భర్త చనిపోకపోతే మృతదేహాన్ని స్టీల్‌ప్లాంట్‌లో 27 మీటర్ల ఎత్తులోకి ఎవరు తీసుకొచ్చారని ప్రశ్నించారు. కుటుంబ పోషణకు తన వారసులకు స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబ పోషణ కష్టంగా ఉండడంతో ఓ హోటల్‌లో పాచి పనులు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత సంఘం నేత నిమ్మకూరి రమేష్ మాట్లాడుతూ తాతారావు కుటుంబానికి న్యాయం చేయాలని, ఆయన వారసుడికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాచార హక్కు చట్టం కార్యకర్త కాసా పద్మ రాజు పాల్గొన్నారు.

నేడు మంత్రి లోకేష్ రాక

మహారాణిపేట: రాష్ట్ర ఐటీ,మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ శనివారం విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి విమానంలో శనివారం సాయంత్రం 5.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఎంజీఎం గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి తొమ్మిది గంటలకు విమానాశ్రయానికి చేరుకొని రాత్రి 9.50 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళతారు.

ఐఈఐ కౌన్సిల్ సభ్యుడిగా ప్రకాశరావు


ప్రకాశరావు

మురళీనగర్: భారతదేశంలో ప్రతిష్టాత్మకమైన ప్రొఫెషనల్ ఇంజినీర్ల అసోసియేషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా(ఐఈఐ) జాతీయ స్థాయి కౌన్సిల్ సభ్యుడిగా మురళీనగర్‌కు చెందిన మెకానికల్ ఇంజినీర్ కె.ఎస్.ఎస్ ప్రకాశరావు ఎన్నికయ్యారు. 1920లో స్థాపించిన ఈ సంస్థలో కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావడం అత్యంత విశేషంగా చెప్పుకుంటారు. దేశవ్యాప్తంగా 15 లక్షల మందికి పైగా సభ్యులున్న ఈ అసోసియేషన్‌కు పలు రాష్ట్రాల్లో కేంద్రాలు ఉన్నాయి. ఈ సంస్థ ఇంజినీరింగ్ విద్య, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించి.. ఇంజినీర్లు, ఇంజినీరింగ్ స్టూడెంట్స్ ప్రొఫెషనల్ అభివృద్ధికి కృషి చేస్తోంది. అటువంటి ప్రతిష్టాత్మక సంస్థకు విశాఖకు ప్రకాశరావు కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావడం గర్వకారణంగా పలువురు పేర్కొన్నారు. ఆయన నాలుగేళ్లపాటు ఈ పదవిలో ఉంటారు. సంస్థతో 35 ఏళ్ల అనుబంధం ఉన్న ప్రకాశరావు ఐఈఐ విశాఖపట్నం లోకల్ సెంటర్ గౌరవ కార్యదర్శిగా సుమారు ఐదేళ్లు పనిచేశారు. గవర్నమెంట్ విశాఖపట్నం పాలిటెక్నిక్‌లో 1981 నుంచి డిసెంబర్ 2016 వరకు వివిధ హోదాల్లో పనిచేసి మెకానికల్ విభాగాధిపతిగా పదవీ విరమణ చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో చీఫ్ కన్సల్టెంట్‌గా పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

సీజ్ చేసిన వాహనాలకు మోక్షం!

- మధురవాడ డంపింగ్ యార్డులో తుప్పల తొలగింపు


డంపింగ్ యార్డులో వాహనాలు పరిశీలిస్తున్న ఏసీపీలు వెంకటరావు, లక్ష్మణరావు

మధురవాడ: మట్టిలో మట్టినై.. మొక్కలో మొక్కనై.. అన్నట్లు వివిధ కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన వాహనాలు వాటిలోనే కలిసిపోయాయి. మధురవాడ శివశక్తినగర్ రోడ్డులోని రైతుబజార్ పక్కన ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులోని 12 వేల పైనే పోలీసులు సీజ్ చేసిన వాహనాలు ఉన్నాయి. ఇవి చాలా వరకు మట్టిలో కూరుకుపోయి ఉన్నా యి. మరికొన్ని చెట్లు, తుప్పల మధ్యలో దీనస్థితిలో ఉన్నాయి. చాలా వాహనాలు తుప్పు పట్టి కనీసం కదపలేని స్థితికి చేరుకున్నాయి. మొత్తానికి ఈ ప్రాంతం విష పురుగులు, సర్పాలకు నిలయంగా మారింది. 2017లో సుమారు మూడు ఎకరాల్లో ఇక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. నగరంలో ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాన్ని సీజ్ చేసినా.. ఈ యార్డుకు తీసుకొచ్చేవారు. ఇది పూర్తిగా నిండిపోవడంతో గాజువాకలో మరో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మధురవాడ డంపింగ్ యార్డులో సుమారు 10 వేల బైక్‌లు, 2 వేల వరకు మూడు, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి.

తుప్పలు తొలగింపు: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వచ్చిన తర్వాత ప్రతి నెలా రికవరీ మేళా పేరుతో సాధారణ కేసుల్లో పట్టుబడిన వాహనాలను తిరిగి వాహనదారులకు అప్పగిస్తున్నారు. ఇందులో భాగంగా డంపింగ్ యార్డుల్లో ఉన్న వాహనాలకు సంబంధించిన యజమానులను గుర్తించాలని పోలీస్ అధికారులను సీపీ ఆదేశించారు. దీంతో శుక్రవారం మధురవాడ డంపింగ్ యార్డులోని వాహనాలను పోలీస్ అధికారులు పరిశీలించారు. డీసీపీ(క్రైం) లతా మాధురి పర్యవేక్షణలో ఏడీసీపీ మోహనరావు, ఏసీపీలు ఎ.వెంకటరావు, లక్ష్మణరావు, పీఎంపాలెం క్రైం ఇన్‌స్పెక్టర్ వి.ఎస్.ఎస్.ప్రకాష్ ఆధ్వర్యంలో నగరంలోని 22 క్రైం పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఎనిమిది మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, సిబ్బంది ఈ వాహనాలను గుర్తించే పనిలో పడ్డారు. మొదట రోజు పూర్తిగా తుప్పలు తొలగించారు.

'మినీ గోకులం షెడ్ల నిర్మాణ పనులు వేగవంతం'


పనులు పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ శివ ప్రసాద్, డ్వామా పీడీ పూర్ణిమాదేవి

సాక్షి, అనకాపల్లి: ఎన్ఆర్ఈజీఎస్ నిధుల్లో భాగంగా మంజూరైన సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అడిషనల్ కమిషనర్ ఎం. శివ ప్రసాద్ ఆదేశించారు. పెందుర్తి నియోజక వర్గంలో సరిపల్లి, జంగాలపాలెం, పెదగాడి పంచాయతీల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. పల్లె పండగలో భాగంగా మంజూరైన సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పెందుర్తిలోని జిల్లా సమాఖ్య ప్రాంగణంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల పర్యవేక్షక ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు, క్లస్టరు అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అదనపు ప్రోగ్రాం అధికారులు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. పల్లె పండగలో భూమి పూజ చేసి ప్రారంభించిన సీసీ రోడ్లు, మినీ గోకులం షెడ్లలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఆమోదం పొంది ఇంకా పూర్తి కాలేనటువంటి పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు.

సంక్రాంతి ముందే పూర్తి.. : అనకాపల్లి జిల్లాలో మంజూరైన 1142 సీసీ రోడ్లు, 851 గోకులం షెడ్లను, విశాఖ జిల్లాలో 140 సీసీ రోడ్లు, 151 గోకులం షెడ్లను సంక్రాంతికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తయిన పనులకు ఎఫ్‌టీవోలు జనరేట్ చేస్తే..త్వరగా పేమెంట్ ప్రక్రియ కూడా పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, విశాఖ పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్, డీపీఆర్ఈవో వీరన్నాయుడు, అనకాపల్లి, విశాఖ జిల్లాల సబ్ డివిజనల్ ఇంజినీర్లు, ఏపీడీలు, అదనపు ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్-లక్నో స్పెషల్ రైలు రద్దు

తాటిచెట్లపాలెం: ఇటీవల ప్రకటించిన సికింద్రాబాద్-లక్నో-సికింద్రాబాద్(07084/07083) స్పెషల్ ట్రిప్‌ను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 22న సికింద్రాబాద్-లక్నో(07084) స్పెషల్, ఈ నెల 25న లక్నో-సికింద్రాబాద్ (07083) స్పెషల్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో పండ్ల వ్యాపారి ఆత్మహత్య

- భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్యాయత్నం

పెందుర్తి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. భార్య మృతిని తట్టుకోలేక భర్త కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపగుంటలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలివీ.. వేపగుంట రామాలయం వద్ద నివాసం ఉంటున్న పలుకూరి నాగరాజు, విజయలక్ష్మి(37) దంపతులు స్థానికంగా పండ్ల దుకాణం నిర్వహిస్తున్నారు. కాగా ఇటీవల కాలంలో వీరు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం విజయలక్ష్మి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకుని ఇంటికి వెళ్లిన నాగరాజు భార్య మరణాన్ని జీర్ణించుకోలేక పెట్రోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు విజయలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యయత్నానికి పాల్పడిన నాగరాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో వివాదం

ఒకరిపై హత్యాయత్నం

మధురవాడ: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో తలెత్తిన వివాదం కారణంగా ఓ వ్యక్తిపై ఇద్దరు కుటుంబ సభ్యులు, మరో ఇద్దరు కలిసి హత్యాయత్నం చేశారు. పీఎంపాలెం 2వ బస్టాప్ సమీపంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివీ.. పీఎంపాలెం 2వ బస్టాప్ ఎస్‌బీఐ వెనుక ఓరే చంద్రశేఖర్ నివాసం ఉంటున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పేరూరి సోమశేఖర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తర్వాత వ్యాపార లావాదేవీల్లో ఇరువురి మధ్య వివాదాలు తలెత్తాయి. కాగా.. సింహాద్రిరావు అనే వ్యక్తిని డబ్బుల కోసం వేధిస్తుండడంతో గత నెలలో సోమశేఖర్‌పై చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేయించాడు. దీంతో పగబట్టిన సోమశేఖర్ గురువారం రాత్రి 8.30 నుంచి 9 గంటల మధ్య చంద్రశేఖర్ ఇంటికి వెళుతుండగా ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో అడ్డుకున్నారు. సోమశేఖర్, అతని భార్య మహాలక్ష్మితో పాటు మరో ఇద్దరు కారుపై వచ్చి వెనుక నుంచి చంద్రశేఖర్‌ను కొట్టారు. దీంతో చంద్రశేఖర్ రోడ్డుపై పడిపోవడంతో ఇనుప రాడ్‌తో దాడి చేయడంతో తలపై రక్తస్రావం అయింది. గొలుసుతో అతన్ని చెట్టుకు కట్టేసి అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు అతన్ని రక్షించి కేజీహెచ్‌కు తరలించారు. బాధితుడు అర్ధరాత్రి 1.30 గంటలకు సోమశేఖర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.